క్లుప్తంగా

హెల్మెట్‌తో కుటుంబానికి రక్షణ

మార్టూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా రహదారులపై జరిగే ప్రమాదాలను నియంత్రించవచ్చని బొల్లాపల్లి టోల్ గేట్ సిబ్బంది ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా.. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమని మన కోసం ఎదురుచూసే కుటుంబ సభ్యుల కోసం, విలువైన ప్రాణాలు రక్షించుకోవడం కోసం వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం రేపు

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్ట్, చీరాల ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ సెమినార్ హాలులో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి అతిథులుగా చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిద్దీన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

కాలువల్లో చెత్త వేస్తే చర్యలు

కారంచేడు: గ్రామాల్లోని మురుగు ప్రవహించే కాలువల్లో సమీప గృహాలకు చెందిన ప్రజలు చెత్తా, చెదారం వేయవద్దని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వేమూరి రామ్మోహనరావు తెలిపారు. బుధవారం కారంచేడులో పర్యటించారు. రోడ్డుకు ఇరువైపులా ఉండే ప్రజలు.. చెత్త, తాగి పడేసే కొబ్బరిబోండాలు, టీ కప్పులు, కాగితాలు, కవర్లు, వాటర్ బాటిల్స్ వేయడం వలన మురుగు నీరు నిలచిపోయి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దీనివల్ల అనేక అంటు వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు. గౌతమబుద్ధ అసోసియేషన్ తరపున చుండూరి రామయ్య పర్యవేక్షించారు.

విజిలెన్స్ తనిఖీలు

అద్దంకి: మండలంలోని చక్రాయపాలెంలోని యువరాజ్ రేషన్ దుకాణంలో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. బియ్యం బస్తాలను తూకం వేసి, సరుకుల తూకంలోనూ, నిల్వల్లోనూ తేడాలు లేకపోవడంతో అన్నీ బాగానే ఉన్నాయని విజిలెన్స్ అధికారి సుధీర్ డీలరుకు చెప్పి వెళ్లారు. అయితే ఇది వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడి దుకాణం కావడంతో గతంలోనూ ఇదే విధంగా అధికారులు తనిఖీలు చేసి ఏదో సాకుతో 6ఏ కేసు నమోదు చేశారు. డీలరు రెండు సార్లు హైకోర్టుకు వెళ్లి అవి తప్పుడు కేసులని తేల్చి మరలా దుకాణం తెచ్చుకున్నాడు. అయితే ఈ దుకాణంపై ఎలాగైనా కేసు నమోదు చేయించి దుకాణం లైసెన్స్ రద్దు చేయాలని చూస్తున్నారని డీలరు వాపోతున్నాడు. ఇటీవల వికలాంగులకు పంచుతున్న బియ్యం ఆటోను ఆపి రేషన్ తరలుతోందని గ్రామ టీడీపీ నాయకుడు అధికారులకు ఫోన్ చేశారు. దీంతో వారు తనిఖీలు చేసి ఏమీ లేదని చెప్పి వెళ్లారని తేల్చారని చెప్పాడు. ఇదంతా కావాలని చేస్తున్నారని డీలరు చెబుతున్నాడు. అయితే సదరు అధికారి ఏ మీడియాకు సమాచారం ఇవ్వకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

ఇంకొల్లు(చినగంజాం): ఎరువుల దుకాణాల్లో యూరియా అక్రమ నిల్వలు ఉండి కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జి. సురేష్ హెచ్చరించారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ఇంకొల్లులో బుధవారం ఆయన ఎరువుల దుకాణాలను సందర్శించి పరిశీలించారు. ఇంకొల్లులోని మూడు ఎరువుల దుకాణాలను సందర్శించి దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి యూరియా రికార్డు పరంగా నమోదు, యూరియా స్టాక్‌ను పరిశీలించి సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. యూరియాను అక్రమంగా నిల్వ చేస్తే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధునిక పద్ధతులతో సాగు లాభం

బల్లికురవ: రైతులు వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకునేందుకు ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు.

5 నుంచి చిన్న, మధ్య తరగతి పత్రిక సమావేశాలు

అద్దంకి రూరల్: చిన్న, మధ్యతరగతి పత్రిక అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 5,6 తేదీల్లో శింగరకొండలోని వేమారెడ్డి సేవాసమితి ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర చిన్న, మధ్య తరగతి పత్రికల అసోషియేషన్ అధ్యక్షుడు సందిరెడ్డి కొండలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 రాష్ట్రాల నుంచి 150 మంది చిన్న, మధ్య తరగతి పత్రికా సంపాదకులు హాజరవుతారని తెలిపారు. అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు కేబీ చందోల, పత్రికా సంపాదకులు పాల్గొన్నారు.



విద్యుత్ సప్లయ్ వైర్లను కప్పిన మొక్కలు



విద్యుత్ తీగలు తగిలి సోమవరప్పాడులో తగలబడుతున్న వరిగడ్డి ట్రక్కు

- విద్యుత్ తీగలను కమ్మిన మొక్కలు
- వేల్లాడుతున్న విద్యుత్ తీగలు
- శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు
- ట్రూ అప్ చార్జీలతో బాదుడు
- పట్టించుకోని అధికారులు

గుండె గుభిల్లు సేవలు నిల్లు!

బల్లికురవ:

విద్యుత్ సేవలు పేలవంగా ఉన్నాయి. ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం చిత్తశుద్ధి చూపించకపోవడంతో విద్యుత్ వినియోగదారులు... బిల్లు వాతలతో పాటు ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక భయాందోళనలు చెందుతున్నారు.

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరానిచ్చే పోల్‌తో పాటు లైన్‌ను పచ్చని చెట్లు పూర్తిగా కమ్మేశాయి. ఇవి చెట్లా.. విద్యుత్ లైనా అని గుర్తించే పరిస్థితి లేదు. బల్లికురవ నుంచి చెన్నుపల్లి వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డుకు దక్షిణ భాగంలోని సీతమ్మ కుంటకు సమీపంలోని విద్యుత్ పోల్‌ను, సప్లయ్ వైర్లను 4 మాసాల నుంచి ఇలా చెట్లు కమ్మేశాయి. నిత్యం పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు, సమీపంలోని గ్రానైట్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఈ రోడ్డు మీద నుంచే వెళ్లాలి. సమీపంలోనో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్లుగానే వ్యవరిస్తున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

ప్రతిరోజూ సాంకేతిక లోపాలు, మరమ్మతుల పేరిట మండల కేంద్రంలో గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతోంది. దీంతో మండలానికి పలు పనులపై వచ్చే ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. ఫొటో స్టాట్‌లు, సరిఫికెట్లు వంటి పనులపై వచ్చేవారికి తిప్పలు తప్పడంలేదు. అలాగే మల్లాయపాలెం, వేమవరం, ఉప్పమాగులూరు, కొప్పరపాలెం, చెరుకుపల్లి, వల్లాపల్లి, వైదన, కొప్పరపాడులో కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఎప్పుడంటే అప్పుడు విద్యుత్‌ను కోతలు విధిస్తున్నారు.

కిందకు జారిన సప్లైయ్ వైర్లు

గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందకు జారడంతో తరచూ ప్రమాదాల వల్ల ఆస్తి నష్టం జరుగుతోంది. ఇటీవల సోమవరప్పాడు, ముక్తేశ్వరం, వేమవరం, అంబడిపూడి గ్రామాల్లో ఇటీవ ప్రమాదాలు జరిగాయి. వైర్లు కిందకు జారి ఉండటంతో వరిగడ్డి ట్రక్కులు తగలబడుతున్నాయి. దీనివల్ల వేలాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. ప్రమాదం జరిగినప్పుడు తాత్కాలికంగా వైర్లు సరి చేస్తున్న అధికారులు ఆ తర్వాత యథావిధిగా ప్రవర్తిస్తున్నారు. ఇక పలు చోట్ల శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలుతాయో తెలియడంలేదు. ట్రూప్ అప్‌చార్జీలతో అధిక విద్యుత్ బిల్లులు భరిస్తున్నా.. విద్యుత్ కష్టాలు తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు.



సోమవరప్పాడులో కూలే దశలో ఉన్న విద్యుత్ స్తంభం

బూచేపల్లిని కలిసిన నాయకులు

చినగంజాం: దర్శి శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో చినగంజాం మండలానికి చెందిన పలువురు యువనాయకులు బుధవారం కలిశారు. ఒంగోలు జెడ్పీ కార్యాలయం విడిది గృహంలో ఆయనను కలిసి పూలబొకేలను అందజేశారు. అనంతరం పర్చూరు నియోజక వర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ స్థితి గతులు గురించి పార్టీ పరిస్థితిని గురించి బ్రహ్మానందరెడ్డి వివరించారు. వర్గ వైషమ్యాలను పక్కనబెట్టి నియోజక వర్గంలో పార్టీ అభివృద్ధికి యువత కృషి చేయాలని అంతా కలిసి కట్టుగా ఉండి రాబోయే కాలంలో పార్టీ గెలుపు కోసం యువకులు ముందుండి పార్టీని విజయపథంలో నడిపించాలని ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి వారికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీకి చెందిన యువకులు ఎం. హేమంత్ కుమార్ రెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, మేడికొండ అనిల్, కోకి రమేష్ రెడ్డి, ఆట్ల ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.



దర్శి ఎంఎల్ఏ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని కలిసిన చినగంజాంకు చెందిన యువనాయకులు

బహిరంగ మద్యపానం శిక్షార్హం



కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ ఖాదర్ బాషా

కారంచేడు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని కారంచేడు ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా హెచ్చరించారు. బుధవారం కారంచేడులోని ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యువత, గ్రామస్తులు మద్యం సేవించేందుకు ఎన్నుకొనే స్థలాలు, పబ్లిక్‌కు సంబంధించినవిగా ఉండకూడదన్నారు. ప్రజలు సంచరించే ప్రదేశాల్లో మద్యం, జూదం వంటివి నిర్వహించకూడదని తెలిపారు. అలా చేస్తే మొదట కౌన్సిలింగ్ చేస్తామని.. పద్ధతి మార్చుకోకుంటే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంట పొలాల్లో కోళ్ల వ్యర్థాలు డంప్

జె.పంగులూరు: మండల పరిధిలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామ శివారులోని పంట పొలాల్లో గ్రామంలోని కోళ్ల ఫారంలోని కోళ్ల వ్యర్థాలను డంప్ చేశారు. గ్రామస్తులు పొలం పనులకు అటువైపుగా వెళ్ళాలన్నా రైతులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పాడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. వర్షాకాలం అయితే వ్యర్థాలు కారుతూ దగ్గరలోని పంట కాలువలోకి వస్తున్నాయన్నారు. అధికారులు తక్షణమే స్పందించి వ్యర్థాలను తొలగించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఈ విషయమై గ్రామంలోని సంబంధిత అధికారిని అడగ్గా వారు కోళ్ల వ్యర్థాలను తొలగించమన్నామని, దీంతో కొంత తీశారని, మిగలిని వ్యర్థాలను తొలగిస్తామని తెలిపారని చెప్పారు.



తూర్పు తక్కెళ్లపాడు గ్రామ శివారులోని పంట పొలాల్లో కోళ్ల వ్యర్థాలు

పథకాల పేరుతో మోసం

బల్లికురవ: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరిట అలివికాని హామీలు ఇచ్చి కంటి తుడుపుగా పథకాలు అమలు చేసిందని.. లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి మండలంలోని వైదన గ్రామంలో గ్రామ, బూత్ కమిటీల ఎంపికతో పాటు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ 2014 నుంచి 19 వరకు బాబు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని రుణమాఫీ పూర్తి స్థాయిలో చేస్తానని ప్రకటించి చేయకుండానే ముగించారన్నారు. వ్యవసాయ పనుల సీజన్ ఆరంభంతో యూరియా కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ముందు చూపులేకపోవటంవల్లే కొరత ఏర్పడిందన్నారు. క్యూలైన్‌లో యూరియా కోసం రైతులు పడిగాపులు, జాతీయ, రాష్ట్రీయ రహదారులపై రాస్తారోకో చేస్తున్న ప్రభుత్వం సంబరాలకే ప్రాధాన్యత ఇస్తోందని రైతుల కష్టాలు తీర్చటంలేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే గ్రామ, బూత్ మండల కమిటీతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు కృష్ణబాబు వివరించారు. గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఆలకుంట శ్రీనివాసరావు, చింతి ప్రేమ్‌కుమార్, బూత్ కమిటీ అధ్యక్షుడుగా పసుపులేటి సుబ్రమణ్యం, మేడా రామాంజనేయులు, వంశీ మరో పదిమందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మేడా శివదుర్గాబాబు, కాతా రాంబాబు, బొమ్మిశెట్టి బ్రహ్మయ్య, బద్రి సుబ్బయ్య, బుజ్జిదానయ్య, గాలం అంజయ్య పాల్గొన్నారు.



వైదనలో పాల్గొన్న మండల కన్వీనర్, స్థానిక నేతలు

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

చినగంజాం: అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుని భార్యకు చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయమందించి వైద్యఖర్చులకు తోడ్పాటు అందించారు. మండలంలోని పెదగంజాం గ్రామానికి చెందిన కోమట్ల మల్లిఖార్జునరెడ్డి భార్య భ్రమరాంభ తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ విజయవాడలోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. పేదరికంతో వైద్యశాల ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో మిత్రులు ఆర్థిక సాయమందించారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980–81 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన మిత్రులు స్పందించారు. సుమారు 22 మంది కలిసి భ్రమరాంభ వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 50 వేలు నగదు సేకరించారు. ఈ మొత్తాన్ని అందుబాటులో ఉన్న వారి కుమార్తె శివనాగకుమారి, అల్లుడు అయ్యప్ప రెడ్డికి బుధవారం అందజేశారు. ఉలిచి సాంబశివరావు, శిఖరం కోటయ్య, చుండూరి వెంకటేశ్వరరావు, కోమట్ల వెంకట రమణారెడ్డి, నరహరి కృష్ణారావు, పలివేట రాఘవరావు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

జింక్ లోపం లేకుండా చూసుకోండి

చీరాల రూరల్: రైతులు ముమ్మరంగా నారుమడులు పోస్తున్నారని నారుమడులకు జింక్ లోపం లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. నిర్మలాదేవి సూచించారు. బుధవారం మండల పరిధిలోని దేవినేతల, కావూరివారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నిర్మలాదేవి రైతులనుద్దేశించి మాట్లాడారు. ఎకరా పొలంలో 20 కేజీల చొప్పున జింక్ వేసుకున్నట్లయితే జింక్ లోపం లేకుండా ఉంటుందని సూచించారు. అంతేకాకుండా సేంద్రియ ఎరువులను వాడినట్లయితే సూక్ష్మ పోషకాల లోపాలను నివారించవచ్చునని తెలిపారు. వీఏఏ జి. రామారావు, రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

సొసైటీ అధ్యక్షునిగా ఆంజనేయులు

జె.పంగులూరు: మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు గ్రామ సొసైటీ అధ్యక్షునిగా గొల్లపూడి ఆంజనేయులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రకాశ జిల్లా పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య హాజరై గొల్లపూడి ఆంజనేయులు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయలు మాట్లాడుతూ రైతులకు ఎప్పుడు అందుబాటు ఉంటూ అవసరమైనప్పుడు లోన్లు, ఎరువులు సకాలంలో అందిస్తానని తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు కరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, గుర్రం శేఖర్, ఓబులరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



తూర్పు కొప్పెరపాడు సొసైటీ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆంజనేయులు

ఉల్లాసంగా ముగ్గుల పోటీలు

అద్దంకి రూరల్: అద్దంకిలోని నాగులపాడు రోడ్డులోని శివసాయి రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మహిళలు కోలాటం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని మూడో లైన్లో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రుల్లో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి గురువారం బహుమతులు అందజేయనున్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

పర్చూరు(చినగంజాం): విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్ళొద్దని పర్చూరు ఎస్‌ఐ జీవీ చౌదరి సూచించారు. బుధవారం స్థానిక శాతావాహన హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్కాలు, పాన్ పరాగ్, గంజాయి, కొకైన్ వంటి నిషేధిత మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళవద్దని తెలియజేశారు. డ్రగ్స్ వాడటం వలన యువత అనారోగ్యం బారిన పడి తమ జీవితాలను పోగొట్టుకుంటున్నారని తెలిపారు. అందరూ బాగా చదివి మంచి మార్గంలో నడవాలని కోరారు. ట్రైన్డ్ ఎస్‌ఐ పులి గోపి, పాఠశాల కరస్పాండెంట్ తేళ్ళ వెంకటరాము తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ జీవీ చౌదరి

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యం

యద్దనపూడి: సేంద్రియ ఎరువుల వాడకం వలన నేల ఆరోగ్యంగా ఉంటుందని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జి. ప్రవీణ సూచించారు. పొగాకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు.. యాజమాన్య పద్ధతులపై ఆత్మ ఆధ్వర్యంలో పూనూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు వ్యవసాయాధికారి కుమారి ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పర్చూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జి. ప్రవీణ మాట్లాడుతూ పంటలకు కేవలం రసాయనిక ఎరువుల వాడటం వలన నేల చౌడు బారి దిగుబడులు తగ్గుతాయని అలా కాకుండా సేంద్రియ రసాయనిక ఎరువులు సమపాళ్లలో వాడుకోవడం ద్వారా నేల ఆరోగ్యంగా ఉండి దిగుబడులు పెరుగుతాయన్నారు. భూమిలో అధికంగా ఉన్న రసాయనిక ఎరువులను మొక్కలకు అందుబాటులో తేవడానికి జీవన ఎరువులైన ఫాస్పరస్ సాల్యుబుల్ బ్యాక్టీరియా, పొటాషియం సాల్యుబుల్ బాక్టీరియా, వీఏఎం అనే జీవన ఎరువులను వాడుకోవలన్నారు. లాంఫాం రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేష్ చౌదరి మాట్లాడుతూ పత్తి, మొక్కజొన్న, సోయా చిక్కుడు, శనగ పంటల్లో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీయం హారిక, వ్యవసాయ విస్తరణాధికారి రాధ, గ్రామ వ్యవసాయ సంచాలకులు విజయలక్ష్మి, శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు, ప్రభాకర రావు,గ్రామ నాయకులు బోయపాటి సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.



పూనూరు గ్రామంలో రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

రుణాలు సద్వినియోగం చేసుకుంటే పురోగతి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని ఏపీఎం కె.మధుసూదనరావు సూచించారు. బుధవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల మండల సమాఖ్య వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెలా 10వ తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలన్నారు. సూర్య ఘర్ పథకాన్ని పొదుపు సభ్యులకు వివరించి సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామ పొదుపు సంఘాల్లో మహిళలు విధిగా నెలవారీ వాయిదాల రుణాల చెల్లింపులో అలసత్వం వహించకూడదన్నారు. ఉన్నతి పథకంలో రుణాలు తీసుకున్న పొదుపు మహిళలు విధిగా రుణాలు చెల్లించాలని, పెండింగ్‌లో లేకుండా గ్రూపు లీడర్లు కృషి చేసేలా వీఏవోలు ప్రతి గ్రూపును పరిశీలించాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్:

గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని, ప్రజలంతా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దేవాంగపురి గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీను సూచించారు. బుధవారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గుమ్మస్తాలకాలనీ, కృపానగర్, హస్తినాపురం, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ పంపిణీ చేసిన డస్ట్‌బిన్లును వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేసి పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలను అందించాలన్నారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజలందరు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులున్నారు.